# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

9th HAPPY ANNIVERSARY

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 341 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | ఆదివారం 18 ఆగస్టు 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


## ఆగస్టు 15 లోగా రుణమాఫీ పూర్తిచేస్తామన్నారు..
# ఎక్కడ చేశారు?



- సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డ బీఆర్ఎస్ నేత
- ఎన్నికల మేనిఫెస్టోలో 40 వేల కోట్లు మాఫీ చేస్తామన్నారు
- కేబినెట్ భేటీలో 31 వేల కోట్లకు తగ్గించారు
- బడ్జెట్ లోనేమో 26 వేల కోట్లు కేటాయించారని హరీశ్ రావు విమర్శ
- తీరా చేసిందేమో 17 వేల కోట్ల రూపాయలు మాత్రమేనని ఆరోపణ
- రైతు రుణమాఫీపై హరీశ్ రావు కీలక ప్రెస్ మీట్

వివరాలు 2లో..

# సిద్దిపేటలో టెన్షన్ టెన్షన్







- హరీశ్ రాజీనామా చేయాలని ఫ్లెక్సీలు
- వాటిని చించేసిన బీఆర్ఎస్ లీడర్స్
- సిద్దిపేటలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి
- కేసీఆర్ ఫ్లెక్సీని చించేసిన కాంగ్రెస్ కార్యకర్తలు
- సీఎం రేవంత్ ఫ్లెక్సీ ఏర్పాటుకు కాంగ్రెస్ యత్నం
- ర్యాలీగా బయల్దేరిన కాంగ్రెస్ లీడర్లను అరెస్టు చేసిన పోలీసులు
- ఎమ్మెల్యే నివాసంపై దాడి జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటి: ట్విట్టర్ లో హరీశ్ రావు

**సిద్దిపేట పెన్ పవర్:** జిల్లా కేంద్రంలో నిన్న అర్ధరాత్రి నుంచి టెన్షన్ వాతావరణం నెలకొంది. రూ. రెండు లక్షల రుణమాఫీని పంద్రాగస్టులోపు అమలు చేసినందన హరీశ్ రావు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిని బీఆర్ఎస్ నేతలు చించివేసేందుకు యత్నించగా కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి చేరుకొని ఆందోళనకు దిగారు. క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు. బీఆర్ఎస్ నాయకులను పోలీసు స్టేషన్ కు తరలించారు. ఇదిలా ఉండగా.. అర్ధరాత్రి దాటాక కొందరు గుర్తు తెలియని వ్యక్తులు సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుపై దాడి చేశారు. క్యాంప్ ఆఫీసు బయట ఉన్న కేసీఆర్ ఫ్లెక్సీలను చించివేశారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు.
తో పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటనపై హరీశ్ రావు ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఎమ్మెల్యే అధికారిక నివాసంపై అర్ధరాత్రి పూట కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం బాధాకరమని చెప్పారు. ఈ దాడిని అడ్డుకోవాల్సిన పోలీసులే

వివరాలు 2లో..

# హరీష్ రావువి చిల్లర మాటలు

**కిసాన్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి**



- 31 వేల కోట్ల లోన్లు మాఫీ చేసినం
- మాఫీ ప్రక్రియ ఇంకా పూర్తి కాలే
- ధర్నా చేసే నైతిక హక్కు బీజేపీకి లేదు
- కిసాన్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని, రుణమాఫీ కేటీఆర్ కు, హరీశ్ రావుకు ఇష్టం లేదా..? అనేది తేల్చాలని కిసాన్ కాంగ్రెస్ నేత కోదండరెడ్డి ప్రశ్నించారు. మూడు విడుతల్లో 31 వేల కోట్ల రైతు రుణాలను మాఫీచేశామని, ఒక్కో రైతుకు రూ. రెండు లక్షల రుణం వరకు మాఫీ అయిందన్నారు. ఫీలో పొరపాట్లు సర్దే ప్రక్రియ మొదలైందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రైతుల పక్షమేనని చెప్పారు. 2018 లో రూ. 20వేల 480 కోట్లు రు

వివరాలు 2లో..

## దసరా నుంచి స్కిల్ వర్సిటీ.. ఆరు కోర్సులకు అడ్మిషన్లు

- తాత్కాలిక భవనంలో తరగతులు
- పరిశీలనలో మూడు భవనాలు
- 20 కోర్సుల గుర్తింపు.. ఆరింటిలో అడ్మిషన్లు
- భాగస్వామ్యానికి 40 కంపెనీల ఆసక్తి
- త్వరలో వెబ్ సైట్, లోగో విడుదల చేస్తం
- సీఎస్ శాంతి కుమారి వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** దసరా నుంచి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ప్రారంభమవుతుందని సీఎస్ శాంతి కుమారి చెప్పారు. ఇవాళ సెక్రటేరియట్ లో ఈ స్కిల్ యూనివర్సిటీ ప్రారంభం, విధి విధానాల ఖరారు, కోర్సుల ప్రారంభం తదితర అంశాలపై నేడు ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు రూపుదిద్దుకున్నాఈ వర్సిటీకి ఆనంద్ మహీంద్రను చైర్మన్ గా ,శ్రీనివాస సి రాజును కో చైర్మన్ గా నియమించామని అన్నారు.

వివరాలు 2లో..

## హుసేన్ సాగర్ లో నిమజ్జనంపై కోర్టు ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ ఇమేజ్ ను మరింత పెంచేలా చూస్తామన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. గణేష్ ఉత్సవాల నిర్వహణపై బంజారాహిల్స్ లోని కమాండ్ కంట్రోల్ రివ్యూ చేశారు. మరో వారం రోజుల్లో ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ సమితితో కూడా మీటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు . ఈ రోజు ఇంటర్నల్ డిపార్ట్మెంటల్ కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటు చేశామని చెప్పారు పొన్నం. గతంలో జరిగిన చిన్న చిన్న లోటుపాట్లు ఈ ఏడాది జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు పొన్నం.

వివరాలు 2లో..

## 31,500 కోట్ల పెట్టుబడులు.. 30, 750 ఉద్యోగాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పెట్టుబడులే లక్ష్యంగా అమెరికా ,సౌత్ కొరియా పర్యటనలో అంతర్జాతీయ సంస్థలతో చర్చలు జరిపామన్నారు మంత్రి శ్రీధర్ బాబు. 19 సంస్థలతో 31 వేల 500 కోట్ల ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. దీని ద్వారా 30,750 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. అమెరికా సౌత్ కొరియా పర్యటనలో కంపెనీలతో ఎంవోయూలు చేసుకున్నామన్నారు శ్రీధర్ బాబు. పెట్టుబడులే లక్ష్యంగా విదేశీ పర్యటనకు వెళ్లామని చెప్పారు.
పర్యటన హిట్టయిందా? ఫ్లాప్ అయ్యిందా

వివరాలు 2లో..

## హీరో విజయ్ పార్టీతో పొత్తుపై మా పార్టీ అగ్రనేతలు నిర్ణయిస్తారు

- కొత్తగా రాజకీయ పార్టీ స్థాపించిన హీరో విజయ్
- విజయ్ ఎంతో తెలివైనవాడన్న కుష్బూ
- సోదరుడి వంటివాడని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళ స్టార్ హీరో విజయ్ ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త రాజకీయ పార్టీని ప్రకటించిన సంగతి తెలిసిందే. విజయ్ పార్టీ పేరు తమిళగ వెట్రి కళగమ్ (టీవీకే). తాజాగా, టీవీకే అంశంపై ప్రముఖ సినీ నటి, బీజేపీ నేత కుష్బూ స్పందించారు. తమిళనాడు ఎన్నికల్లో విజయ్ పార్టీతో పొత్తుపై బీజేపీ అగ్రనేతలు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. విజయ్ రాజకీయాలకు కొత్త... అతనికి మీరేమైనా సలహా ఇస్తారా? అనే ప్రశ్నకు కుష్బూ స్పందిస్తూ... "విజయ్ ఎంతో తెలివైన వ్యక్తి. నాకు సోదరుడు వంటివాడు... ఆయనకు అంతా మంచే జరగాలని కోరుకుంటున్నాను" అని బదులిచ్చారు. కాగా, కుష్బూ జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలి పదవికి రాజీనామా చేశారు. దీనిపై ఆమె వివరణ ఇచ్చారు. ప్రజలతో కలిసి మరింత పనిచేసేందుకు వీలుగా ఆ పదవిని వదులుకున్నానని చెప్పారు. తాను రాజకీయ నేతనని, తనవంటి వారు జాతీయ మహిళా కమిషన్ వంటి సంస్థల్లో కొనసాగడం కంటే క్షేత్రస్థాయిలో రాజకీయాలు చేయాల్సిన

వివరాలు 2లో..

## కోల్ కతా హత్యాచారం కేసు.. 43 మంది డాక్టర్లపై మమతా బెనర్జీ వేటు

- హత్యాచారం కేసులో కఠిన చర్యలకు దిగిన బెంగాల్ ప్రభుత్వం
- నిరసనలో పాల్గొన్నందుకే బదిలీలు చేశారంటున్న యునైటెడ్ డాక్టర్స్ అసోసియేషన్
- విధుల్లో ఉన్న డాక్టర్లకు భద్రత కల్పించాలని డిమాండ్



**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్ కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ట్రైనీ డాక్టరుపై అత్యాచారం, హత్య ఘటనకు సంబం ధించి దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బెంగాల్ లోని మమతా బెనర్జీ ప్రభుత్వం కఠిన చర్యలకు దిగింది. ఏకంగా 43 మంది డాక్టర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పశ్చిమబెంగాల్ ఆరోగ్య శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. మరోవైపు ఇంతమంది వైద్యులను బదిలీ చేయడంపై మెడికల్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. నిరసన

వివరాలు 2లో..

## క్షమాపణ చెప్పినప్పటికీ నోటీసులు వచ్చాయి... 24న మహిళా కమిషన్ ఎదుట హాజరవుతా



- కాంగ్రెస్ హయాంలో మహిళలపై జరుగుతున్న దాడులను కమిషన్‌కు వివరిస్తానని వెల్లడి
- 8 నెలలుగా దాడులు, అత్యాచారాలు జరుగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారో అడుగుతానన్న కేటీఆర్
- రేవంత్ రెడ్డి ప్రధాని మోదీతో టచ్‌లోకి వెళ్లారన్న కేటీఆర్

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ మహిళా కమిషన్ ఇచ్చిన నోటీసులు తనకు అందాయని, ఈ నెల 24న కమిషన్ ముందు హాజరవుతానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తనకు ఈ మెయిల్ ద్వారా ఈ నోటీసులు అందాయన్నారు. 24న ఉదయం 11 గంటలకు మహిళా కమిషన్ ఎదుట హాజరై, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక

వివరాలు 2లో..

# సంపాదకీయం

## ఇక భారత్ లో యుసీసీ....

విశ్లేషణ)

యుసిసి అన్ని వర్గాలకు మేలు మాత్రమే కాకుండా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విజన్ అయిన 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'కు అనుగుణంగా ఉంటుందని.. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' ఆలోచనాతీరుతో నడుస్తుందని బీజేపీ వర్గాలు చెబుతూ వస్తున్నాయి. అయితే, యూసీసీలోని ప్రతిపాదనల్లో బహుభార్యత్వం, బాల్య వివాహాలపై పూర్తి నిషేధం, అన్ని మతాలలోని బాలికలకు ప్రామాణికమైన వివాహ వయస్సు, విడాకుల కోసం ఎవ్వరికైనా ఒకే ప్రక్రియ ఉన్నాయనీ.. లింగ సమానత్వం, సామాజిక ఐక్యతను పెంపొందించే లక్ష్యంతోనే ఈ చట్టాన్ని తీసుకువస్తున్నట్లు ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు.ఈ యూసీసీ ముసాయిదా పౌర జీవితంలోని వివిధ కోణాలకు ఆపాదించబడుతుంది. వారసత్వ హక్కులు, తప్పనిసరి వివాహ నమోదు, బాలికలకు పెరిగిన వివాహ వయస్సు, వివాహానికి ముందు వారి విద్యాభ్యాసాన్ని సులభతరం చేయడం వంటి సిఫార్సులు ఉన్నాయి. అదనంగా, తమ వివాహాలను నమోదు చేసుకోని జంటలు ప్రభుత్వ సౌకర్యాలకు అనర్హులవుతారు. కనుక ఇది చట్టపరమైన డాక్యుమెంటేషన్‌ను తప్పనిసరి చేసే చట్టంగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు.అయితే, ఈ ప్రతిపాదిత యూసీసీ చట్టం.. ముస్లిం మహిళలతో సహా ప్రతి ఒక్కరికీ దత్తత హక్కులను మంజూరు చేస్తోందని అంటున్నారు. అయితే, ఇది హలాలా, ఇద్దత్ వంటి.. విడాకులు తీసుకున్నా? భర్త మరణించిన తర్వాత స్త్రీ తప్పనిసరిగా పాటించాల్సిన ఇస్లామిక్ పద్ధతులను తొలగిస్తోంది. అలాగే, లివ్-ఇన్ రిలేషన్స్ డిక్లరేషన్‌లో ఉన్న సహజీవనాన్ని ప్రోత్సహించడం, సులభమైన దత్తత ప్రక్రియల వంటి పద్ధతులను నిషేధిస్తుంది. ప్రతిపాదిత యూసీసీ అమల్లోకి వచ్చిన తర్వాత, ఇద్దరి మధ్య సహజీవనం అనేది చట్టం ప్రకారం నమోదు చేయాల్సి ఉంటుంది. అలాంటి సంబంధాలను నమోదు చేసుకోవడం వల్ల పురుషులు, మహిళలు ఇద్దరికీ ప్రయోజనం చేకూరుతుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. దీనితో, మహిళలు నమోదు చేసే తప్పుడు కేసులు కూడా తగ్గుతాయనీ.. అలాంటి కేసుల్లో ఇప్పుడు చట్టపరమైన పవిత్రత ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి.ఇక యూసీసీ ఇతర ముఖ్య లక్షణాలను గమనిస్తే.. కుమారులు, కుమార్తెలకు సమాన ఆస్తి హక్కులు, చట్టబద్ధమైన, చట్టవిరుద్ధమైన పిల్లల మధ్య వ్యత్యాసాలను తొలగించడం.. దత్తత తీసుకున్న, బయోలాజికల్‌గా జన్మించిన పిల్లలకు సమాన హక్కులను అందిస్తుంది. ఒక వ్యక్తి మరణించిన సందర్భంలో, ప్రతిపాదిత జఅఅ ప్రకారం, జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులకు సమానమైన ఆస్తి హక్కులు అందుతాయి. అటువంటి హక్కులను పరిమితం చేసిన గత చట్టాలు దీనితో రద్దుచేయబడతాయి. అయితే, ఉత్తరాఖండ్‌లో అమలు చేస్తున్న ముసాయిదాలో జనాభా నియంత్రణ చర్యలతో పాటు, ఉత్తరాఖండ్ జనాభాలో 3 శాతం ఉన్న షెడ్యూల్డ్ తెగలను మినహాయించారు. దీని ప్రకారం, ఇతర రాష్ట్రాల్లో కూడా యూసీసీని తీసుకువస్తే షెడ్యూల్ తెగలను మినహాయించి, ఇతర హిందూయేతర కమ్యూనిటీలకు వర్తించే విధంగా.. అంటే, ముఖ్యంగా.. అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న ముస్లింలకు వర్తించే విధంగా దీన్ని అమలు చేయాల్సి ఉంటుంది.జఅఅని అమలు చేసిన మొదటి భారతీయ రాష్ట్రంగా ఉత్తరాఖండ్ అవతరించినప్పటికీ, ఇంకొన్ని రాష్ట్రాలు కూడా దీనిని అమలు చేయాలనే ఉద్దేశాన్ని పలుమార్లు వ్యక్తం చేశారు. కర్నాటకలో 2023 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ పార్టీ యూసీసీ అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అయితే ఎన్నికల ఫలితాలు బీజేపీకి అనుకూలంగా రాలేదు. ఇక, గతేడాది ఫిబ్రవరి 2024 నాటికి అస్సాంలో యూసీసీని అమలు చేస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ చెప్పారు. ట్రిపుల్ తలాక్ గురించి శర్మ మాట్లాడుతూ, "ఎవరూ ఒకరి కంటే ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండటానికి అనుమతించబడరు. మన ముస్లిం మహిళల గొప్ప ప్రయోజనాల కోసం యూనిఫాం సివిల్ కోడ్‌ను అమలు చేయాలి" అని అన్నారు. అలాగే, జూన్ 2023లో, ప్రధాని మోడీ మహారాష్ట్రలో యూసీసీ అమలు చేస్తామని చెప్పారు. దీనిపై ఆ రాష్ట్రం తొమ్మిది మంది సభ్యుల కమిటీని కూడా ఏర్పాటు చేశారు. ఇక, 2022లో, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, గుజరాత్‌లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు కూడా యూసీసీ అమలు చేస్తామని చెప్పారు. అయితే, ఇంతవరకూ ఉత్తరాఖండ్ మినహా ఇతర రాష్ట్రాలు ఏవీ ప్రతిపాదనను ముందుకు కొనసాగించలేదు.అయితే, ఈ సమస్యకు మూలాలు బ్రిటీష్ వలస పాలనలోనే మొదలయ్యాయి. దీనికి హిందూ కోడ్ బిల్లు సాక్ష్యంగా నిలించింది ఒకవైపు పురుషాధిక్య సమాజం, మరోవైపు మత విశ్వాసాల మధ్య జీవిస్తున్న సమాజంలో చట్టం అమలు.. దాని లక్ష్యానికి తగ్గట్లు వ్యక్తులను, ముఖ్యంగా స్త్రీలకు రక్షణ కల్పించడం కష్టసాధ్యంతో కూడుకున్న పని. అంతకుమించి, ఈ చట్టం కుటుంబ సంబంధాల్లో మరిన్ని సమస్యలు తెచ్చే పెట్టే అవకాశం ఉందనే వాదనలూ లేకపోలేదు. చట్టం చుట్టూ.. ఏకరూపత, లింగ సమానత్వం, సాంఘిక ఏకీకరణ కనిపిస్తున్నప్పటికీ.. అదే సమయంలో మత స్వేచ్ఛ, వ్యక్తిగత హక్కుల గురించి ఆందోళనలను కూడా పెంచుతుంది.ఇక, భారతదేశంలో ఉన్న వ్యక్తిగత చట్టాలు, ప్రస్తుత మతపరమైన ఆచారాలు, సంప్రదాయాల ఆధారంగానే ఉన్నాయి. హిందూ వ్యక్తిగత చట్టాలనేవి పురాతన గ్రంథాలు, ఆచారాల నుండి ఉద్భవించాయి. హిందూ సమాజంలో వివాహం అనేది విడాకులు, వారసత్వం వంటి విషయాలను నియంత్రిస్తాయి. మరోవైపు, ముస్లిం పర్సనల్ లా బోర్డు, ముస్లింల వ్యక్తిగత విషయాలను పర్యవేక్షిస్తుంది. అలాగే, ఇతర మత సంఘాలు వారి స్వంత వ్యక్తిగత చట్టాలను కలిగి ఉంటాయి. అయితే, వీటన్నింటనీ నిషేధిస్తూ ఈ చట్టం రావడం వారి మనోభావాలను పూర్తిగా విస్మరించడమే అనే వాదనలు వస్తున్నాయి.యూనీఫాం సివిల్ కోడ్ అమలుకు ఉన్న సవాళ్లలో మత పెద్దలదే కీలక పాత్ర. వీరిలో కొందరు సామరస్యం, జాతీయ సమైక్యతల కోసం వాదిస్తుంటే.. మరికొందరు మత స్వేచ్ఛ, సాంస్కృతిక పద్ధతులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇవి మతాంతర వివాహాలు, సంబంధాలపై ప్రభావం చూపిస్తాయి. వివాహంలో స్థిరత్వాన్ని నిర్ధారిస్తుంది. విభిన్న మతపరమైన నేపథ్యాలకు చెందిన జంటలు ఎదుర్కొనే సంక్లిష్టతను తగ్గిస్తుంది. అదే సమయంలో కుల దురహంకార పరువు హత్యలను మరింత తీవ్రతరం చేసే అవకాశం కూడా ఉంటుందనే వాదనలు ఉన్నాయియూనిఫాం సివిల్ కోడ్‌కు సంబంధించి వివిధ సంఘాలు భిన్నమైన అభిప్రాయాలు, ఆందోళనలను కలిగి ఉన్నాయి. కొందరు మెరుగైన సాంఘిక ఐక్యత ఉంటుందని చెబుతుంటే.. మరికొందరు సాంస్కృతిక గుర్తింపు కోల్పోవడం గురించి భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య మోడీ ప్రతిపాదిస్తున్న ఈ సెక్యులర్ సివిల్ కోడ్ వ్యవహారంలో రాష్ట్రాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో చూడాల్సి ఉంది.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు

## ఆగస్టు 15 లోగా రుణమాఫీ పూర్తిచేస్తామన్నారు.. ఎక్కడ చేశారు?

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో ఆగస్టు 15 తర్వాత రైతులంతా రుణవిముక్తులు అవుతారని సీఎం రేవంత్ రెడ్డి ఘనంగా ప్రకటనలు చేశారు.. ఇప్పుడు లెక్కలు చూస్తే కేవలం 22 లక్షల మంది రైతులకు, రూ.17 వేల కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి గతంలో హరీశ్ రావుకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య ఛాలెంజ్ ల పర్వం కొనసాగిన విషయం తెలిసిందే. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీది బోగస్ హామీ అని, ఆగస్టు 15 లోగా రుణమాఫీ చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ క్రమంలోనే ఆగస్టు 15న రూ.2 లక్షల వరకున్న రైతుల రుణాలను మాఫీ చేస్తున్నట్లు వైరా సభావేదికపై సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ ప్రకటన తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికలో హరీశ్ రావును కించపరిచేలా పోస్టులు పెడుతున్నారు. దీనిపై శనివారం హరీశ్ రావు స్పందించారు. రైతు రుణమాఫీకి సంబంధించి తన సవాలు గురించి మాట్లాడేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.

**రుణమాఫీ పాక్షికమే..**

రైతు రుణమాఫీ విషయంలో రేవంత్ రెడ్డి బూటకపు మాటలు చెబుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఓ మాట, ఇప్పుడొక మాట అన్నట్లుగా మాటలతో పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. ఆగస్టు 15 లోపు రాష్ట్రంలో సంపూర్ణ రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానన్నారు. అయితే, ప్రభుత్వం రుణమాఫీ పూర్తిగా చేయలేదని, పాక్షికంగా మాత్రమే చేసిందని తెలిపారు. రుణమాఫీ లెక్కల విషయానికి వస్తే కాంగ్రెస్ నేతలు, రేవంత్ రెడ్డి చెప్పిన మాటల ఆధారంగానే మాఫీ లెక్కలు పరిశీలించవచ్చని చెప్పారు. రేవంత్ రెడ్డి వివిధ సందర్భాలలో మాట్లాడిన మాటలను వినిపిస్తూ రుణమాఫీ ఎక్కడ పూర్తయిందో చెప్పాలని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రూపొందించిన మేనిఫెస్టోలో రూ.40 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. దీనికి సంబంధించిన పేపర్లను హరీశ్ రావు మీడియాకు చూపించారు. ప్రభుత్వంలోకి వచ్చాక రైతు రుణమాఫీపై కేబినెట్ మీటింగ్ తర్వాత ఈ మొత్తం నిధులు రూ.31 వేల కోట్లకు తగ్గించారని గుర్తుచేశారు. రుణమాఫీ అమలుకు రాష్ట్ర బడ్జెట్ లో రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారని హరీశ్ రావు చెప్పారు. దీనిపై తాను అసెంబ్లీలోనే ప్రభుత్వాన్ని నిలదీశానని గుర్తుచేశారు. "ఎన్నికల మేనిఫెస్టోలో 40 వేల కోట్లని అన్నారు.. కేబినెట్ సమావేశంలో 31 వేల కోట్లు చెప్పారు, బడ్జెట్ లో 26 వేల కోట్లు కేటాయించారు. ఈ నిధులు ఎక్కడ సరిపోతాయి? ఎవరికి ఎగవెడతరు?" అని ప్రశ్నించినట్లు చెప్పారు. వైరా సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన తర్వాత నిజంగానే రుణమాఫీ పూర్తిచేశారేమోననే ఆశతో లెక్కలు చూశామని హరీశ్ రావు చెప్పారు. అయితే, రాష్ట్రంలో ఇప్పటి వరకు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయినట్లు గుర్తించామని హరీశ్ రావు చెప్పారు. రుణమాఫీ పూర్తిచేయకుండా తనను రాజీనామా చేయమనడం కాదు.. రైతు రుణమాఫీ పాక్షికంగానే చేసినందుకు ప్రజలను క్షమాపణ కోరాలని, నిజాయితీ ఉంటే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

## హుసేన్ సాగర్ లో నిమజ్జనంపై కోర్టు ఆదేశాల ప్రకారం ముందుకెళ్తాం

- మొదటి పేజీ తరువాయి

దేశంలో ముంబై తరువాత హైదరాబాద్ లో గణేష్ ఉత్సవాలు గ్రాండ్ గా జరుగుతాయని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా బోనాలు ఎలా నిర్వహించుకున్నామో.. అలాగే గణేష్ నిమజ్జనం కూడా జరిగేలా చూస్తామన్నారు. ప్రజలందరినీ భాగస్వామ్యం చేసి, ఘనంగా నిర్వహించాలన్నారు పొన్నం. హుసేన్ సాగర్ లో నిమజ్జనం అంశం కోర్టు ఆదేశాలు ప్రకారం ముందుకు పోతామన్నారు పొన్నం. గణేష్ మండపం నిర్వాహకులు పోలీసులకు ఇన్ఫార్మ్ చేయాలని.. అందరూ ఆన్లైన్ లో అప్లై చేసుకోవాలని సూచించారు. తద్వారా ఎన్ని విగ్రహాలున్నాయి .. వారికి వెహికిల్స్ ఎలా అరేంజ్ చేయాలో ఒక క్లారిటీ వస్తుందన్నారు

## సిద్దిపేటలో టెన్షన్ టెన్షన్

- మొదటి పేజీ తరువాయి

దుండగులను రక్షించడం శోచనీయమని చెప్పారు. ఒక ఎమ్మెల్యే అధికారిక నివాసంపైనే ఈ తరహా దాడి జరిగిందంటే సామాన్యుల పరిస్థి తి ఏమిటన్నారు. లీసుల సమక్షంలో ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి ప్రజ లను భయభ్రాంతులకు గురిచేయడం కాంగ్రెస్ మార్క్ పాలనకు నిద ర్శనం. వెంటనే ఈ ఘటనపై డీజీపీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సీఎం ఫ్లెక్సీతో క్యాంప్ ఆఫీసుకు కాంగ్రెస్**

ఇదిలా ఉండగా ఇవాళ ఉదయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారీ ఫ్లెక్సీని తీసుకొని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుకు బయల్దేరారు కాంగ్రెస్ నేతలు. కేసీఆర్ పదవి కోల్పోయి 8 నెలలు గడిచినా ఆయన ఫ్లెక్సీని ఎమ్మెల్యే అధికారిక నివాసంలో ఏర్పాటు చేయడం ఏమిటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ర్యాలీగా వెళుతున్న సిద్దిపేట కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణతో పాటు కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీస్ వాహనంలో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్ కి తరలించారు. దీంతో సిద్దిపేటలో ఫ్లెక్సీల వార్ మరింతగా హీట్ పెంచింది.

## 31,500 కోట్ల పెట్టుబడులు.. 30, 750 ఉద్యోగాలు

- మొదటి పేజీ తరువాయి

అన్న ప్రశ్న కాదు పెట్టుబడులు రావాలి..యువతకు ఉద్యోగాలు రావాలన్నదే తమ లక్ష్యమన్నారు. సౌత్ కొరియా లాంటి దేశంలో పర్యటించడం తొలిసారని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీలతో సీఎం చర్చలు జరిపారన్నారు. రాష్ట్ర ప్రగతిలో భాగస్వామ్యులు కావాలని కంపెనీ ప్రతినిధులను కోరామని చెప్పారు. సెమీ కండక్టర్ల తయారీలో దిగ్గజ కంపెనీలత చర్చలు జరిపామన్నారు శ్రీధర్ బాబు. వరల్డ్ బ్యాంక్ ఛైర్మన్, అడాబ్ సీఈవోతో చర్చలు జరిపామన్నారు. మొదటి సారి పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి స్థాయిలో అమెరికా వెళ్లామన్నారు. గత పదేళ్లలో ముఖ్యమంత్రి స్థాయిలో అమెరికా వెళ్లలేదన్నారు. హైదరాబాద్ 4.0 విజన్ ను పారిశ్రామిక వేత్తలకు వివరించామని చెప్పారు.

ఐటీ రంగంలో గ్లోబల్ కెపబుల్ సెంటర్స్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నామని చెప్పారు శ్రీధర్ బాబు. రాష్ట్రంలో బయోడిజైర్ సిటీ ఏర్పాటు

చేయాలని స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీని కోరామన్నారు. అమెజాన్ సంస్థ త్వరలో భారీ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందన్నారు. మోనార్క్ ఎలక్ట్రికల్ ట్రాక్టర్ల కంపెనీ ఏర్పాటుకు ఒప్పందం జరిగిందన్నారు శ్రీధర్ బాబు. బయో ఇథనాల్ తయారీ కంపెనీలతో ఒప్పందం జరిగిందన్నారు.

## హరీష్ రావువి చిల్లర మాటలు

- మొదటి పేజీ తరువాయి

ణమాఫీ చేస్తామని అప్పటి సీఎం కేసీఆర్ చెప్పారన్నారు. కేవలం 13వేల 3వందల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ రుణమాఫీ ప్రక్రియను ఆలస్యం చేయ డం తో ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ర్హులైన రైతులకు రుణమాఫీ కాకపోతే జిల్లాల్లో నోడల్ ఆఫీసర్ కు దరఖాస్తు పెట్టు కోవాలని కోదండరెడ్డి సూచించారు. కేంద్రంలో బీజేపీ సర్కారు తెచ్చిన నల్ల చట్టాలు కారణంగా 700 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. బీజేపీ నేతలు అసెంబ్లీ ముందున్న అమరవీరుల స్థూపం వద్ద ధర్నా చేసే నైతిక హక్కు లేదని కోదండరెడ్డి పేర్కొన్నారు.

## హీరో విజయ్ పార్టీతో పొత్తుపై మా పార్టీ అగ్రనేతలు నిర్ణయిస్తారు

- మొదటి పేజీ తరువాయి

అవసరమే ఎక్కువగా ఉంటుందని కుష్బూ వివరించారు.

మహిళా కమిషన్ సభ్యత్వం నుంచి వైదొలగుతానన్న విషయాన్ని ఏడు నెలల కిందటే బీజేపీ అధినాయకత్వానికి చెప్పానని, అయితే పదవిలో కొనసాగాలని అగ్రనేతలు సలహా ఇచ్చారని వెల్లడించారు.

## దసరా నుంచి స్కిల్ వర్సిటీ.. ఆరు కోర్సులకు అడ్మిషన్లు

- మొదటి పేజీ తరువాయి

మొత్తం 20 కోర్సులు ప్రారంభించాలని భావించామని, ఈ సారి ఆరు కోర్సులను ప్రారంభిస్తామని అన్నారు. ముచ్చర్ల వద్ద కేటాయించిన 57 ఎకరాల స్థలంలో ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకు స్థాపన చేశారని, ఈ నిర్మాణ పనులు ముగిసేంతవరకు ఈ యూనివర్సిటీ ని తాత్కాలిక భవనంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందుకు గాను, ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా గానీ, నాక్ లేదా నిథమ్ లో నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దాదాపు 140 కంపెనీలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి చూపుతున్నాయని, దాదాపు 20 కోర్సులను ప్రారంభించేందుకు ప్రణాళికలు రూపొందించగా, తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలోనూ సర్టిఫికెట్ కోర్స్ లు, డిప్లొమా కోర్సులను ప్రారంభించనున్నట్టు తెలిపారు. వివిధ విభాగాల్లో శిక్షణ నిమిత్తం దేశంలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలైన ఎస్బీఐ , న్యాక్ , డాక్టర్ రెడ్డీస్, టీవీఏజీఏ , అదానీ సంస్థలు భాగస్వాములుగా ఉండేందుకు అంగీకరించాయని అన్నారు. వీరితోపాటు సీఐఐ కూడా ముందుకు వచ్చిందని వెల్లడించారు. ఈ యూనివర్సిటీ కి సంబందించిన లోగో ను, వెబ్ సైట్ ను ప్రారంభించేందుకు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ యూనివర్సిటీ లో కోర్సు పూర్తి చేసిన వారికి ఆకర్షణీయమైన వేతనంతో కూడిన ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, పరిశ్రమల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామ కృష్ణారావు, జయేష్ రంజన్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసి ఎండీ విష్ణు వర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ వెంకట రమణ, శ్రీని రాజు, వీవీఎల్ఎస్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

## కోల్ కతా హత్యాచారం కేసు.. 43 మంది డాక్టర్లపై మమతా బెనర్జీ వేటు

- మొదటి పేజీ తరువాయి

ఉద్యమంలో పాల్గొన్నందుకు శిక్షగానే ఇంత మందిని బదిలీ చేశారని విమర్శించారు. ప్రభుత్వ చర్యను ఖండిస్తున్నామని యునైటెడ్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రకటించింది. డాక్టర్ల బదిలీలు పూర్తిగా అన్యాయమని తెలిపింది. హత్యాచార ఘటనలో బాధితురాలికి న్యాయం చేయాలని, విధుల్లో ఉన్న వైద్యులకు భద్రత కల్పించాలంటూ తాము కోరుతున్న డిమాండ్లపై ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గబోమని స్పష్టం చేసింది.

## పరిశ్రమల కోసం టాస్క్ ఫోర్స్

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 17:**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ భేటీ అయ్యారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో పట్టుబడుల అంశంపై చర్చించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్- విజన్ 2047 రూపకల్పన అంశాలపై ప్రధానంగా చర్చ జరిగింది.పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇచ్చేందుకు, ప్రణాళికలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయనుంది. దేశంలో పేరున్న పారిశ్రామిక వేత్తలు, ఆయా రంగాల నిపుణులతో ఈ టాస్క్ ఫోర్స్ ఏర్పాటు కానుంది.ముఖ్యమంత్రి చైర్మన్ గా, టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ కో - చైర్మన్ గా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు కానుంది. 2047 నాటికి ఏపీని నెంబర్ 1 స్టేట్ చేసే లక్ష్యంతో ఏపీ ప్రభుత్వం విజన్ 2047 రూపొందించే పనిలో పడింది. దీనిలో భాగంగా పారిశ్రామికాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై టాస్క్ ఫోర్స్ కమిటీ పనిచేయనుంది.అమరావతిలో సిఐఐ భాగస్వామ్యంతో స్టేట్ ఆఫ్ సెంటర్ ఫర్ గ్లోబల్ లీడర్ షిప్ సంస్థ ఏర్పాటుకు నిర్ణయించింది.

ఈ సంస్థ ఏర్పాటులో టాటా గ్రూప్ భాగస్వామికానుంది. విశాఖలో టిసిఎస్ డెవల్మెంట్ సెంటర్ ఏర్పాటు, ఏపీలో ఎయిర్ ఇండియా, విస్తారా ఎయిర్ లైన్స్ విస్తరణ అంశాలపై టాటా గ్రూప్ చైర్మన్ తో సీఎం చంద్రబాబు చర్చించారు. రాష్ట్రంలో సోలార్, టెలీకమ్యునికేషన్స్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై సమాలోచనలు చేశారు.

## క్షమాపణ చెప్పినప్పటికీ నోటీసులు వచ్చాయి... 24న మహిళా కమిషన్ ఎదుట హాజరవుతా

- మొదటి పేజీ తరువాయి

మహిళలపై జరిగిన దాడులను వివరిస్తానని వెల్లడించారు.

ఎనిమిది నెలలుగా మహిళలపై దాడులు, అత్యాచారాలు జరుగుతుంటే ఏం చర్యలు తీసుకున్నారో మహిళా కమిషన్‌ను అడుగుతానన్నారు. తాను చేసిన వ్యాఖ్యలకు గాను నిన్ననే బహిరంగ క్షమాపణ చెప్పానని... అయినప్పటికీ తనకు నోటీసులు ఎందుకు ఇచ్చారో తెలియదన్నారు.

తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిని అన్నారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నేతలు అన్న మాటలను కూడా కమిషన్ దృష్టికి తీసుకువెళతానన్నారు.

**ప్రధాని మోదీకి రేవంత్ రెడ్డి టచ్‌లోకి వెళ్లారు...**

సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ టచ్‌లోకి వెళ్లారని కేటీఆర్ ఆరోపించారు. తాను చనిపోయే సమయానికి బీజేపీలోనే ఉంటానని మోదీకి చెప్పినట్లుగా తెలిసిందన్నారు. ప్రధానితో అలా అన్నారో లేదో... ముఖ్యమంత్రి చెప్పాలని నిలదీశారు.

**రుణమాఫీపై క్షేత్రస్థాయికి వెళతాం**

కాంగ్రెస్ పార్టీ చేసిన రుణమాఫీకి సంబంధించి తాము క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలు సేకరిస్తామని కేటీఆర్ అన్నారు. తాము సేకరించిన డేటాను కలెక్టర్, సీఎస్‌లకు అందిస్తామన్నారు. ఎల్లుండి నుంచి డేటాను సేకరించి వారంలో పూర్తి చేస్తామని వెల్లడించారు.

# అన్నా క్యాంటీన్ల ఖర్చు రూ. 200 కోట్లు

**స్టేట్ పొలిటికల్ బ్యూరో పెన్‌పవర్, ఆగస్టు 17:** అమ్మ.. అన్న..పేరు ఏదైతేనేం.. పేదోళ్ల కడుపులు నింపడానికి? ఏపీలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా? తాము పెట్టుకున్న గడువుకున్నా ముందే టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు పేరుతో తీసుకొచ్చిన పథకం అన్న క్యాంటీన్లు. ఇక్కడ భోజనం చేయడానికి అర్హత అక్కర్లేదు. రేషన్ కార్డు చూపించక్కర్లేదు. కడుపులో ఆకలి, చేతిలో 5 రూపాయలు ఉంటే చాలు.. అన్న క్యాంటీన్లోకి అడుగుపెట్టొచ్చు. ఓ పెద్ద హోటల్ అందించేంత మెనూతో, అత్యంత శుభ్రతతో భోజనం వడ్డిస్తారు. నిజానికి గతంలోనే కూలీలు, కార్మికులు, డ్రైవర్లు, వీధుల్లో షాపులు నడిపించేవారు.. ఇలా ఎంతో మంది పేదల ఆకలి తీర్చింది అన్న క్యాంటిన్. జస్ట్ 5 రూపాయలకే పరిశుభ్రమైన ఆహారం దొరుకుతూ ఉండటంతో పెద్ద సంఖ్యలో పేదలు వీటిని ఉపయోగించుకున్నారు. ఆ తర్వాత ఐదేళ్లు వీటికి బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్లీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించింది. ఉద్దేశం ఏదైనా.. రాజకీయంగా ఎవరెన్ని కామెంట్లు చేసినా.. పట్టణాల్లోని పేద, దిగువ మధ్యతరగతి వారి ఆకలిబాధ తీర్చాయి అన్న క్యాంటీన్లు. అందులో ఎలాంటి సందేహాలు లేవు.




**అక్షయపాత్ర సహకారం :**

అన్న క్యాంటీన్లలో కేవలం ప్రభుత్వ పాత్ర మాత్రమే లేదు. ఒకరకంగా అన్న క్యాంటీన్ బిల్డింగ్ కట్టించి, భోజనాలు తీసుకొచ్చే హాట్ బాక్స్‌లను మాత్రమే ప్రభుత్వం అరేంజ్ చేస్తుంది. ఆహారం రుచికరంగా వండి సమయానికి తగ్గట్టుగా ట్రాన్స్‌పోర్ట్‌తో సహా తీసుకొచ్చేది మాత్రం హరే కృష్ణ మూమెంట్‌కు చెందిన అక్షయ పాత్ర సంస్థ. బియ్యం కొనటం, వండటం, రుచికరంగా కూరలు వండి జాగ్రత్తగా తీసుకురావడం.. ఈ బాధ్యత తీసుకుంటోంది అక్షయపాత్ర ఫౌండేషన్. పైగా అన్న క్యాంటీన్ల విషయంలో ప్రభుత్వం ఖర్చు పెట్టేది చాలా తక్కువ. రోజుకు ఒక్కో మనిషికి మూడు పూటలకు కలిపి 90 రూపాయలు ఖర్చు అవుతుండగా 15 రూపాయలు మాత్రమే పేదవారి నుంచి కట్టించుకుని.. మిగతా 75 రూపాయలను ప్రభుత్వమే చెల్లించనుంది. మూడు పూటలా కలిపి రోజూ లక్షా 5వేల మంది పేదలకు ఆహారం సరఫరా చేయనున్నారు. ఉదయం 35వేల మందికి టిఫిన్ అందిస్తారు. అంతే స్థాయిలో 35వేల మందికి మధ్యాహ్నం, 35 వేల మందికి రాత్రి సమయంలో భోజనం పెడతారు. ఒక్కో క్యాంటీన్లో సుమారు 350 మందికి సరిపడా ఆహారాన్ని మూడు పూటలా అందుబాటులో ఉంచుతారు.ఎన్ని సంక్షేమ పథకాలున్నా.. పేదల కడుపు నింపుతున్నది మాత్రం అన్నక్యాంటీనే. ప్రస్తుత లెక్కల ప్రకారం ఏడాదికి సుమారు 200 కోట్ల రూపాయలు దీనికి ఖర్చవుతుందని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే, ఈ కార్యక్రమం కోసం విరాళాలు సేకరిస్తోంది ప్రభుత్వం. స్వయంగా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కోటి రూపాయలు విరాళం ఇచ్చారు. తెలుగు ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముందుకురావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.అనవసర ఖర్చులు, ఆడంబరాలు, పెళ్లి ఖర్చులు తగ్గించుకొని అన్న క్యాంటీన్ ట్రస్టుకు విరాళాలివ్వండి. సేవ చెయ్యాలన్న ఆలోచనతో దాతలు ముందుకు రావాలి. మీరు మంచి పనికోసం 10 రూపాయలు ఖర్చు పెడితే.. మీ ఆదాయం 100 రూపాయలు పెరుగుతుంది. విరాళాలిచ్చేందుకు మరింత సౌకర్యంగా ఉండేందుకు డిజిటల్ విరాళాల స్వీకరణకు కూడా ఏర్పాట్లు చేశాం" అని చంద్రబాబు గుడివాడలో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవం సందర్భంగా దాతలకు పిలుపునిచ్చారు. ఒక్కరోజేప్రభుత్వానికి అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం సుమారు రూ. 2కోట్లకు పైగా విరాళాలను దాతలు అందించారు. దీంతో ఇలా సేకరించిన విరాళాలకు అకౌంట్‌బులిటీ ఉండాలనే ఉద్దేశంతో ఎస్‌బిఐలో ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచింది ప్రభుత్వం. ఎవరైనా విరాళాలు అందించాలనుకుంటే ఆ ఖాతాకు కూడా నేరుగా పంపించవచ్చు.అన్న క్యాంటీన్ల విరాళాల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన బ్యాంక్ ఖాతా వివరాలు

**ఖాతా పేరు: అన్న క్యాంటీన్స్**
**ఖాతా నెంబర్: 37818165097**
**బ్రాంచి: చంద్రమౌళినగర్, గుంటూరు**
**ఐఎఫ్‌ఎస్‌సి కోడ్: SMW0020541**

రాష్ట్ర వ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోగా ప్రారంభించాలన్నది ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఇప్పటికే 100 క్యాంటీన్లు మొదలయ్యాయి. సెప్టెంబర్ మొదటి వారానికల్లా మిగతా వాటిని కూడా ప్రారంభిస్తామని ఏపీ సీఎం చెప్పారు. " అన్న క్యాంటీన్లను ట్రస్టు ద్వారా శాశ్వతంగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరలోనే గిరిజన ప్రాంతాల్లో మండలానికో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు.

# విచారణలను ప్రభావితం చేస్తున్న పోలీస్ బాస్ లు కేసులను నీరుగార్చేలా యత్నాలు




**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయవాడ, ఆగస్టు 17:**
వైసీపీ ప్రభుత్వంతో అంటకాగారనే ఆరోపణలతో పోస్టింగ్ దక్కక వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులకు మెమోలు జారీ చేయడం వెనుక ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరుపుతున్న పలు అంశాలపై దర్యాప్తును ప్రభావితం చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి.ఏపీలో వైసీపీ ప్రభుత్వంతో అంటకాగారనే ఆరోపణలతో పోస్టింగ్‌లకు దూరమైన ఐపీఎస్ అధికారులపై డీజీపీ చర్యలు చేపట్టారు. పోస్టింగ్ లేకపోవడంతో ఆఫీసుకు రాకుండా కాలక్షేపం చేస్తున్న ఐపీఎస్‌లపై బుధవారం కొరడా ఝుళిపించారు. హెడ్ క్వార్టర్లు విడిచి వెళ్లకూడదనే ఆదేశాలను పాటించకుండా పలువురు ఐపీఎస్‌లు ఇతర ప్రాంతాల్లో ఉండటంతో చర్యలు చేపట్టారు. వెయిటింగ్‌లో ఉన్న అధికారులు రోజూ ఉదయం పదికల్లా ఆఫీసుకు రావాలని ఆదేవించారు.పోస్టింగ్ లేకుండా వెయిటింగ్‌లో ఉన్నా ఐపీఎస్‌లు ఇకపై రోజూ డీజీపీ ఆఫీసులో హాజరు కావాలని ఆదేశిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పత్తా లేకుండా పోయిన డీజీ స్థాయి నుంచి పలు హోదాల్లో ఉన్న ఐపీఎస్‌లు ఈ జాబితాలో ఉన్నారు. మొత్తం 16మంది పేర్లతో కూడిన జాబితాతో డీజీపీ మెమో జారీ చేశారు. వీరంతా ఇకపై డీజీపీ కార్యాలయంలో రోజూ అటెండెన్స్ నమోదు చేయాల్సి ఉంటుంది.పోస్టింగ్ లేకపోవడంతో విధులకు హాజరు కాని ఐపీఎస్‌లపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. వీరిలో డీజీ స్థాయి అధికారులు పీవీ సునీల్ కుమార్, పిఎస్సార్ ఆంజనేయులు సహా 16మంది ఐపీఎస్‌లు ఇకపై రోజూ డీజీపీ ఆఫీసుకు రావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఆఫీసర్స్ వెయిటింగ్ హాల్లో ఉన్న అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయాలని మెమోలో పేర్కొన్నారు. ఉదయం పది నుంచి అందుబాటులో ఉండాలని విధులు ముగించుకుని వెళ్లే సమయంలో సమయం నమోదు చేయాలని అత్యవసర విధుల కేటాయింపుకు డీజీపీకి అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.వెయిటింగ్‌లో ఉన్న వారిలో డీజీ క్యాడర్‌లో ఉన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ పిఎస్సార్ ఆంజనేయులు, మాజీ సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్, అదనపు డీజీ సిఐడి మాజీ చీఫ్ ఎన్.సంజయ్, విజయవాడ మాజీ సీపీ తాతా కాంతిరాణా, ఐజీ పాలరాజు, సీఐడీ ఐజీ కొల్లి రఘురామిరెడ్డి, డిఐజి అమ్మిరెడ్డి, సిహెచ్ విజయరావు, విశాల్ గున్నీ, ఎస్పీ క్యాడర్‌లో ఉన్న అన్బురాజన్, రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి, రఘువీరా రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా, కృష్ణకాంత్ పాటిల్‌సంజయ్, కొల్లి రఘురామరెడ్డి, సంజయ్ ఉన్నారు.డీజీ స్థాయి ఐపీఎస్ అధికారులకు పోస్టింగ్ ఇవ్వకపోవడం సాధారణమే అయినా, వారు రోజూ కార్యాలయాలకు వచ్చి అటెండెన్స్ నమోదు చేయాలని ఆదేశించడం వెనుక అసలు కారణాలు వెలుగు చూశాయి. వెయిటింగ్ లో ఉన్న ఐపీఎస్ లకు మెమో జారీ వెనుక ఇంటెలిజెన్స్ నివేదికలు కారణంగా తెలుస్తోంది.ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఇసుక తవ్వకాలు, మద్యం విక్రయాలు, ఏపీ ఫైబర్ నెట్ సహా పలు అంశాలపై విచారణకు ఆదేశించింది. వీటిలో కొన్ని కేసుల్ని ఏపీసీఐడీకి అప్పగించింది. ఈ పరిణామాలపై ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించింది. అయితే ప్రభుత్వం విచారణకు ఆదేశించిన కేసులను నీరుగార్చేలా వెయిటింగులో ఉన్న కొందరు ఐపీఎస్ అధికారులు కుట్రలు చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి.ప్రస్తుతం పోస్టింగ్ లేకుండా ఉన్న అధికారుల్లో.. గత ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన పలువురు సీనియర్ అధికారులు ఉన్నారు. వీరంతా రకరకాల స్థాయిల్లో పలు కేసుల్ని నీరు గార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.కేసుల్ని దర్యాప్తు చేస్తున్న అధికారులను, పోలీస్ సిబ్బందిని వెయిటింగులో ఉన్న ఐపీఎస్ లు తమ వద్దకు పిలిపించుకుని మాట్లాడుతున్నారని ప్రభుత్వానికి సమాచారం అందింది. దర్యాప్తు బృందాలను విచారణ సరిగా చేయొద్దని తూతూ మంత్రంగా విచారణ ముగించాలంటూ వెయిటింగ్ లో ఉన్న కొందరు ఐపీఎస్ లు ప్రభావితం చేస్తున్నట్టు నిఘా వర్గాలు గుర్తించాయి.కొన్ని కేసుల్లో తమ పేర్లతో పాటు వైసీపీ పెద్దల పాత్రను ప్రమేయాన్ని తక్కువ చేసి చూపేలా కేసులను దర్యాప్తు చేయాలని ఐపీఎస్ అధికారులు సూచించడంపై ఆధారాలతో సహా నివేదికలను ప్రభుత్వానికి అందించారు. వివిధ కేసుల్లో జరుగుతున్న అంతర్గత విచారణను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నాలు చేసినట్టు ప్రభుత్వం గుర్తించడంతో శాఖపరమైన చర్యల్లో భాగంగా మెమోలు జారీ చేసినట్టు తెలుస్తోందవెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారుల తీరుతో కంగుతిన్న ప్రభుత్వ పెద్దలు, వైసీపీకి అనుకూలంగా ఇప్పటికీ పని చేస్తున్న వారిని గుర్తించాలని పోలీసు బాధ్యులకు సూచించినట్టు సమాచారం. పలు కేసుల దర్యాప్తులో అటంకం కల్పించే ప్రయత్నాలపై చర్యలు తీసుకోడానికి సిద్ధం అవుతోంది.ఈ పరిణామాలతో అప్రమత్తమైన డీజీపీ కార్యాలయం, వెయిటింగ్ లో ఉన్న ఐపీఎస్ అధికారులను రోజు వచ్చి హెడ్ క్వార్టర్స్ లో సంతకాలు చేసి వెళ్ళాలని ఆదేశాలు జారీ చేసింది. భారతీయ న్యాయ సంహితలో కేసు విచారణను ప్రభావితం చేయడం కూడా నేరంగా పరిగణిస్తున్న నేపథ్యంలో చట్టపరమైన చర్యలకు ఉన్న అవకాశాలు పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది.

# యాక్టివ్ పాలిటిక్స్ లోకి భారతి...


**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ కడప, ఆగస్టు 17:**
ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ టెన్షన్ తప్పిపోవడంతో రిలాక్స్ అయిన జగన్ మళ్లీ నవ్వుముఖంతో కనిపిస్తూ.. కూటమి ప్రభుత్వంపై సెటైర్లు మొదలుపెట్టారు. తాము చేసిన మేలు ఇంకా జనాల్లో ఉందంటూ మళ్లీ అధికారంలోకి వచ్చేది తామేనని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఎండగడుతుంది కాని జగన్‌ని పెద్దగా ఎవరూ టార్గెట్ చేయడం లేదు. అసలు వైసీపీని ప్రతిపక్షంగా కూడా గుర్తించడం లేదు. వైసీపీ నేతలతో పాటు జగన్ దానిపై ఎక్కడ బెంగపెట్టుకుంటారో అన్నట్లు పీసీసీ ప్రెసిడెంట్ షర్మిల ఆ లోటు తీరుస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ ఏ ధీమాతో చెప్తున్నారో కాని షర్మిల మాత్రం వైసీపీకి అంత సీన్ లేదని తేల్చేస్తున్నారుషర్మిల కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలుగా వైసీపీని, జగన్‌ని చీల్చి చెండాతున్నారు. గత ఎన్నికల్లో వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి వైసీపీకి ఎంత నష్టం చేయాలో అంతా చేశారు. ఓటమి తర్వాత కూడా వైసీపీని విడిచిపెట్టడం లేదు. సోదరుడు జగన్‌ని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు. ఇప్పటికీ వైసీపీ వైఫల్యాలను ఎండగడుతున్నారు. అధికారపక్షంగా కూటమి ఉన్నా విపక్షమైన వైసీపీని మాత్రమే టార్గెట్ చేస్తున్నారు. అయితే వైసీపీలో ఆమెను సమర్ధంగా ఎదుర్కోవడం ఎవరి తరం కావడం లేదు. గతంలో సజ్జల రామకృష్ణారెడ్డి కౌంటర్ ఇచ్చేవారు. ఓటమి తరువాత ఆయన సైలెంట్ అయ్యారు.ఇప్పుడు పేర్ని నాని సీన్‌లోకి వస్తున్నా.. షర్మిల దూకుడు ముందు ఆయన తేలిపోతున్నారు. దీంతో జగన్ పునరాలోచనలో పడ్డారంట. షర్మిలను కట్టడి చేయకపోతే మొదటికే మోసం వస్తుందని.. వైసీపీని బలోపేతం చేయడం కష్టమని భావిస్తున్నారంట. అందుకే ప్రత్యామ్నాయంగా షర్మిలను ఢీ కొనడానికి తన సతీమణి భారతీ అయితే సరిపోతారని ఒక



నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. వైయస్ రాజశేఖర్ రెడ్డి కోడలిగా, జగన్ భార్యగా ఆమె ప్రజాక్షేత్రంలో అడుగుపెడితే.. ప్రజలు ఆహ్వానిస్తారని జగన్ భావిస్తున్నారంట.జగన్ ఇండియా కూటమి వైపు చూస్తున్నారన్న ప్రచారం విస్తృతంగా జరుగుతున్న తరుణంలో ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగన్ సారథ్యంలోని వైసీపీ ఓ పిల్ల కాలువ అని, అది ఎప్పటికైనా మహాసముద్రమైన కాంగ్రెస్‌లో కలవాల్సిందేనని ఆమె వ్యాఖ్యానించారు. ఇండియా కూటమిలో వైసీపీ చేరుతుందన్న ప్రచారాన్ని ఖండించిన షర్మిల.. వైసీపీ కాంగ్రెస్‌లో విలీనం అవుతుందని పరోక్షంగా వ్యాఖ్యానించడం ఆసక్తి రేపుతోంది.. గతంలోనే షర్మిల ఈ కామెంట్స్ చేసినా.. తాజాగా మరోసారి ఇదే అంశాన్ని ప్రస్తావించడం వెనక ఏమైనా మతలబు ఉందా..? అని రాజకీయ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.ఇండియా కూటమిలో వైసీపీ చేరుతుందనే ప్రచారాన్ని మాత్రమే ఖండించకుండా.. విలీనం అవుతుందనే తరహాలో షర్మిల చేసిన వ్యాఖ్యలు ఏపీ రాజకీయ వర్గాల్లో బిగ్ డిబేట్‌గా మారాయి. ఇప్పటికే ఏపీలోనూ బలపడాలని, అందుకోసం ఏమేం చేయాలన్న దానిపై కాంగ్రెస్ కసరత్తు చేస్తున్న టైంలో షర్మిల వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఆ క్రమంలో జగన్ టార్గెట్‌గా దూకుడు పెంచుతున్న షర్మిలను ఎదుర్కొనే విషయంలో వైసీపీ నానా తంటాలు పడుతోంది. ఒకరిద్దరు నేతలు షర్మిలకు కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నా.. షర్మిలదే పైచేయిగా నిలుస్తోంది. దీంతో షర్మిలను ఎదుర్కొనే విషయంలో వైసీపీ తీవ్ర కసరత్తు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. షర్మిల విమర్శలపై స్వయంగా జగన్ నోరు మెదపలేని స్థితిలో ఉన్నారు.షర్మిల విషయంలో ఇంకా మెతక వైఖరి అవలభిస్తే పార్టీకి నష్టం వాటిల్లుతుందని జగన్ భావిస్తున్నారంట. గతంలో మంత్రులుగా పని చేసిన రోజా, విడదల రజిని, తానేటి వనిత, పుష్ప శ్రీవాణితోపాటు మహిళా కమిషన్ చైర్మన్‌గా పని చేసిన వాసిరెడ్డి పద్మ కూడా షర్మిల చేస్తోన్న విమర్శలపై మౌనంగానే ఉంటున్నారు. దీంతో షర్మిలకు కౌంటర్ ఇచ్చేందుకు భారతితో పొలిటికల్ ఎంట్రీ ఇప్పించాలని ఆలోచిస్తున్నారంట. మరోవైపు జగన్‌ను పాత కేసులు వెంటాడుతున్నాయి. అక్రమాస్తుల కేసుతోపాటు బాబాయ్ వివేకా హత్య కేసు కూడా ఆయనకు గండంగా మారింది. జగన్ కేసులపై రోజువారి విచారణ చేపట్టాలని కోర్టులు ఆదేశాలు ఇస్తున్నాయి.కేసుల ఉచ్చులో బిగుసుకుపోయిన జగన్ అరెస్టు అయితే పార్టీని నడిపించే నేత అవసరం. అందుకే భారతిని సిద్ధం చేయాలని జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. షర్మిల వాయిస్‌ను గట్టిగానే ఎదుర్కొనేందుకు భారతి సరిపోతారని అలాగే తనకు ప్రత్యామ్నాయంగా పార్టీ పగ్గాలు చేపట్టడానికి భారతి అయితేనే కరెక్ట్ అని జగన్ భావిస్తున్నారంట.తల్లి విజయమ్మ జగన్ వైపు వచ్చే అవకాశం లేకపోవడంతో.. భారతిని తెరపైకి తేవడానికే ఫిక్స్ అయ్యారన్న టాక్ వినిపిస్తుంది. మరి చూడాలి ఏం జరుగుతుందో.

## భారీగా పెరగనున్న రేషన్ డిపోలు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ కాకినాడ, ఆగస్టు 17:** ఏపీలోని కూటమి ప్రభుత్వం రేషన్ షాపులపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఇప్పటికే కొత్త కార్డుల జారీపై కసరత్తు షురూ చేయగా... దుకాణాల సంఖ్యను కూడా పెంచాలని నిర్ణయించింది. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా కొత్తగా 4 వేల పంపిణీ కేంద్రాలను ఏర్పాటు



చేసేందుకు సిద్ధమవుతోంది.కొత్త రేషన్ కార్డుల జారీకి ఆంధ్రప్రదేశ్ లో రంగం సిద్ధమవుతోంది. దీనికి సంబంధించిన డిజైన్లను పౌరసరఫరాల శాఖ పరిశీలించే పనిలో పడింది. త్వరలోనే ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది. ముందుగా కొత్తగా పెళ్లైన వారికి త్వరితగతిన కార్డులను పంపిణీ చేస్తారని సమాచారం. ఇదిలా ఉంటే? రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పంపిణీ కేంద్రాలను పెంచాలని సర్కార్ నిర్ణయించింది. రేషన్ పంపిణీ మరింత సజావుగా సాగడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 29 వేలకుపైగా రేషన్ దుకాణాలు ఉండగా?. కొత్తగా మరో 4 వేల కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సిద్ధమైంది. నిర్దేశిత సమయంలో లబ్ధిదారుడికి రేషన్ అందించటమే లక్ష్యంగా ముందుకు సాగాలని నిర్ణయించింది. ఎక్కువ రేషన్ కార్డులు ఏ పరిధిలో ఉంటే అక్కడ ఈ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీనిపై పౌరసరఫరాల నుంచి ప్రకటన వస్తుంది.ప్రస్తుతం ఉన్న రేషన్ దుకాణాల్లో కొన్నింటికి ఇన్‌ఛార్జ్ డీలర్లు ఉన్నారు. అయితే ఇలాంటి పరిస్థితులు ఎక్కడైతే ఉన్నాయో? వాటిని గుర్తించాలని సర్కార్ నిర్ణయించింది. త్వరితగతిన ఆయా ఖాళీలను కూడా భర్తీ చేసే చర్యలను ప్రారంభించనుంది. ప్రాథమిక వివరాల ప్రకారం? 6 వేలకుపైగా డీలర్ల ఖాళీలు ఉన్నట్లు గుర్తించారుకొత్త రేషన్ కార్డుల డిజైన్లను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ?త్వరలోనే తుది డిజైన్ ను ఖరారు చేయనుంది. ఆ వెంటనే కార్డుల జారీ కోసం ప్రకటన వెలువడనుంది. అయితే ఇకపై రేషన్ కార్డు తీసుకోవాలనుకునే కొత్త జంట.. తప్పనిసరిగా మ్యారేజీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను సమర్పించాల్సి ఉంటుంది. ఇటీవలే ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా రేషన్ కార్డుల జారీపై కీలక ప్రకటన చేశారు. కొత్త కార్డులను డిజైన్ చేసే పనిలోనే ఉన్నామని చెప్పారు.కొత్తగా వివాహమైన జంటలు కొత్త రేషన్ కార్డు కోసం చాలా ఇబ్బందులు పడుతున్నారని?. ఇలాంటి సమస్యలను పరిష్కరించే దిశగా నిర్ణయం తీసుకోబోతున్నామని నాదెండ్ల తెలిపారు. వివాహం చేసుకొని రేషన్ కార్డులో పేర్లు లేనివారిని గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఓ కార్యక్రమాన్ని చేపడుతామనిపేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులను తప్పకుండా జారీ చేస్తామని స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా ముందుగా ఎవరైతే వివాహం చేసుకుని పేర్లు నమోదు చేసుకోలేదో వారిని గుర్తిస్తామని మంత్రి నాదెండ్ల క్లారిటీ ఇచ్చారు. మొత్తంగా చూస్తే త్వరలోనే ఏపీలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ పట్టాలెక్కే అవకాశం ఉంది.

## పిఠాపురంపై మెగా ప్లాన్



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ కాకినాడ, ఆగస్టు 17:** మెగాస్టార్ చిరంజీవి వారసులుగా అడుగుపెట్టిన పవన్ కళ్యాణ్, రామ్ చరణ్‌ల స్థాయి ఏంటో అందరికీ తెలిసిందే. తమ పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ తో లక్షలాది మంది అభిమానులను సొంతం చేసుకున్నారు. పవన్ కల్యాణ్ పుణ్యామాని ఇప్పుడు ఇక్కడ చూసిన పిఠాపురం పేరు మార్మోగిపోతుంది. ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి భారీ మెజార్టీతో గెలిచారు. రాష్ట్ర కేబినెట్లో డిప్యూటీ సీఎంగా కీలక భూమిక పోషిస్తున్నారు. ఎన్నికలకు ముందు పిఠాపురం నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి పవన్ కళ్యాణ్ నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే అక్కడ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఇదిలా ఉంటే పవన్ ను భారీ మెజారిటీతో గెలిపించిన పిఠాపురం ప్రజలకోసం మెగా ఫ్యామిలీ ఒక మంచి నిర్ణయంతో ముందుకొచ్చినట్లు సమాచారం. ఇటీవల పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు, చేబ్రోలు మధ్య పదిన్నర ఎకరాల స్థలాన్ని రామ్ చరణ్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ స్థలంలో ఒక భారీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కట్టడానికి రామ్ చరణ్– ఉపాసన ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ రవణం స్వామినాయుడు ఓ ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇందులో భాగంగా పిఠాపురం నియోజకవర్గంలో వైద్య సేవల రంగంలో దేశంలోనే ప్రముఖ ఆస్పత్రిగా ఉన్న అపోలో పిఠాపురంలో ఏర్పాటు కానుంది.జనసేనాని పవన్ కళ్యాణ్ పిఠాపురంలో ఎన్నికల ప్రచారం సందర్భంగా నియోజకవర్గంలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తీసుకొస్తానని ప్రజలకు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రామ్ చరణ్ తో మాట్లాడి అపోలో ఆస్పత్రిని ఏర్పాటు చేస్తానని.. ప్రజలకు నాణ్యమైన మెరుగైన వైద్య సేవలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పిఠాపురం నుంచి 70 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో పవన్ కళ్యాణ్ ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆయన ఉప ముఖ్యమంత్రిగా కూడా ఉండటంతో తాను ప్రజలకు ఇచ్చిన హామీలపై పవన్ దృష్టి సారించారు. తన బాబాయ్ హామీని నెరవేర్చేందుకు పిఠాపురం నియోజకవర్గంలో పది ఎకరాల స్థలాన్ని కూడా రామ్ చరణ్, ఆయన సతీమణి, అపోలో లైఫ్ సంస్థల చైర్ పర్సన్ ఉపాసన కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నగరాల్లో అపోలో ఆస్పత్రులు సేవలను అందజేస్తున్నాయి. అంతేకాకుండా ప్రముఖ హాస్పిటల్ చైన్ గా కూడా అపోలో సంస్థలకు పేరుంది. ఇప్పుడు పవన్ కళ్యాణ్ పోటీ ద్వారా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిన పిఠాపురంలోనూ అపోలో ఆస్పత్రి ఏర్పాటుకానుంది. ఎన్నికల ప్రచారం సందర్భంగా పవన్ పార్టీ జనసేన తరఫున ప్రచారం చేసిన ఆయన అన్న నాగబాబు కుమారుడు, ప్రముఖ నటుడు వరుణ్ తేజ్, హీరో సాయి ధరమ్ తేజ్ సైతం పిఠాపురం తమ కుటుంబానికి ప్రత్యేక ప్రదేశంగా నిలుస్తుందన్నారు. తమ హృదయంలో పిఠాపురానికి ప్రత్యేక స్థానం ఉంటుందని ఆ సమయంలో చెప్పుకొచ్చారు. ఇదే స్థాయిలో పిఠాపురం నియోజకవర్గ ప్రజలు కూడా కులమతాలకతీతంగా పవర్ స్టార్ కు ఘనవిజయం అందించారు. దీంతో ఇచ్చిన హామీలపై డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్ దృష్టి సారించారు. ఇందులో భాగంగా అతి త్వరలోనే పిఠాపురంలో అపోలో ఆస్పత్రి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన పనులు కూడా మొదలు అయ్యాయి. అపోలో మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రే కాకుండా నియోజకవర్గానికి అవసరమైన ఇతర ప్రజోపయోగ పనులను చేపట్టడానికి సొంత నిధులను సైతం వెచ్చించడానికి మెగా కుటుంబం సిద్ధంగా ఉందని తెలుస్తోంది. మరోవైపు ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గం ఆయన ఆశించినట్టు దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మారబోతుందని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు.

# కోల్‌కతాలో నిరసనలు.. ఫుట్‌బాల్ మ్యాచ్ రద్దు



హైదరాబాద్ పెన్ పవర్: కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ వైద్య కళాశాల ఆసుపత్రి జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం-హత్య ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 24 గంటల పాటు దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు దేశవ్యాప్తంగా అత్యవసరం కాని వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ నిరసన కనిపిస్తోంది. తాజాగా, ఈ నిరసన సెగ క్రీడలను తాకింది. మహిళా వైద్యురాలిపై అత్యాచారం-హత్యను నిరసిస్తూ కోల్‌కతాలో ఆందోళనలు జరుగుతుండడంతో ఆదివారం (ఆగస్టు 17) సాల్ట్ లేక్ స్టేడియంలో జరగాల్సిన ఫుట్‌బాల్ మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేశారు. డ్యురండ్ కప్‌లో భాగంగా ఆదివారం ఈస్ట్ బెంగాల్, మోహన్ బగన్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. రెండూ బలమైన జట్లు కనుక స్టేడియానికి భారీగా అభిమానులు వస్తారని, ఆందోళనలు రేకెత్తితే కట్టడి చేయడం కష్టతరమని పోలీసులు నిర్వాహకులు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో, శాంతి భద్రతల నేపథ్యంలో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇరు జట్లకు ఒక్కో పాయింట్ కేటాయించారు. అంతేకాదు, ఈ టోర్నీలో కోల్‌కతా వేదికగా జరగాల్సిన మిగిలిన మ్యాచ్‌లను జంషెడ్‌పూర్ టాటా స్పోర్ట్స్ కాంప్లెక్స్)కు తరలించనున్నట్లు సమాచారం.

**క్వార్టర్ ఫైనల్‌కు ఇరు జట్లు**

17 సార్లు డ్యురండ్ కప్ ఛాంపియన్ మోహన్ బగన్ (గ్రూప్ ఏ నుండి క్వార్టర్-ఫైనల్‌కు అర్హత సాధించింది. మరోవైపు, మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో ఈస్ట్ బెంగాల్ సైతం క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది.

# ఆడింది చాలు.. వచ్చేయండి: ఇంగ్లాండ్ క్రికెటర్లకు ఈసీబీ షాక్

హైదరాబాద్ పెన్ పవర్: ప్రస్తుతం ఇంగ్లాండ్ లో ది హండ్రెడ్ లీగ్ జరుగుతోంది. ఈ లీగ్ చివరి మ్యాచ్ లకు అంతర్జాతీయ స్టార్ ప్లేయర్లు అందుబాటులో ఉండడం లేదు. శ్రీలంకతో టెస్ట్ సిరీస్ కు ముందు తమ బౌలర్ల ఫిట్‌నెస్‌పై జాగ్రత్తగా ఉండాలని ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు చూస్తోంది. ఇప్పటికే టెస్ట్ జట్టులో సెలక్ట్ అయిన క్రిస్ వోక్స్‌ను హండ్రెడ్ లీగ్ నాకౌట్‌లకు మ్యాచ్ లకు దూరమయ్యాడు. తాజాగా స్టార్ పేసర్ గస్ అట్కిన్సన్ సైతం హండ్రెడ్ లీగ్ ఫైనల్ మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. ఇటీవలే ఈ టోర్నీలో గాయం కారణంగా బెన్ స్టోక్స్ దూరమైన సంగతి తెలిసిందే.

హండ్రెడ్ లీగ్ లో ప్రస్తుతం ఎలిమినేటర్, ఫైనల్ మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. అట్కిన్సన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఓవల్ ఇన్విన్సిబుల్స్ జట్టు ఫైనల్ కు చేరుకుంది. ఈ మ్యాచ్ లో ఈ పేసర్ లేకపోవడం ఆ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగలనుంది. అట్కిన్సన్ ఫైనల్ మ్యాచ్ కు అందుబాటులో ఉండడం లేదని ఇన్విన్సిబుల్స్ కెప్టెన్ సామ్ బిల్లింగ్స్ తెలిపాడు. ఇప్పటికే ఆసీస్ పేసర్ స్పెన్సర్ జాన్సన్ దూరమవ్వడంతో ఇద్దరు స్టార్ పేసర్ సేవలను ఆ జట్టు కోల్పోనుంది. అయితే ఇన్విన్సిబుల్స్ చివరి గ్రూప్ మ్యాచ్ నుండి విశ్రాంతి తీసుకున్న పేసర్ టామ్ కుర్రాన్ జట్టులోకి రావడం ఊరటనిచ్చే అంశం.ఇటీవల ఇంగ్లాండ్ స్పీడ్‌స్టర్ వోక్స్ హండ్రెడ్ లీగ్ నుంచి వైదొలిగాడు. అతడు ఆడుతున్న నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్ నాకౌట్ కు అర్హత సాధించలేకపోయింది. ఇంగ్లాండ్ దిగ్గజ బౌలర్లు అండర్సన్, బ్రాడ్ రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఇంగ్లాండ్ జట్టుకు అట్కిన్సన్, వోక్స్ కీలక పేసర్లుగా మారారు. ముఖ్యంగా అట్కిన్సన్ ఇటీవలే వెస్టిండీస్ తో ముగిసిన సిరీస్ లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గెలుచుకుని సూపర్ ఫామ్ లో ఉన్నాడు. శ్రీలంకతో ఇంగ్లాండ్ స్వదేశంలో మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. జూలై 21న ఓల్డ్ ట్రాఫర్డ్ లో తొలి టెస్ట్ ప్రారంభం కానుంది.



# తప్పుగా అనుకోకండి.. అతను ప్రపంచ స్థాయి ఆటగాడు: జైశ్వాల్‌పై డకెట్



హైదరాబాద్ పెన్ పవర్: స్వదేశంలో ఇంగ్లాండ్ తో ఈ ఏడాది ప్రారంభంలో భారత్ 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్ ను భారత్ 4-1 తేడాతో గెలుచుకోగా.. టీమిండియా ఓపెనర్ యశస్వి జైశ్వాల్ విశ్వరూపమే చూపించాడు. 5 టెస్టుల్లో మొత్తం 712 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అతని దూకుడు ధాటికి ఇంగ్లాండ్ బౌలర్ల వద్ద సమాధానమే లేకుండా పోయింది. అయితే ఈ సిరీస్ లో జైశ్వాల్ దూకుడుగా ఆడడంపై ఇంగ్లాండ్ ఓపెనర్ బెన్ డకెట్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. రాజ్‌కోట్ టెస్టులో 3వ రోజు జైశ్వాల్ మెరుపు సెంచరీతో అదరగొట్టాడు. ప్రారంభంలో ఆచితూచి ఆడిన ఈ ముంబై కుర్రాడు.. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బౌలర్లు ఎవరైనా పూనకం వచ్చినట్టు ఆడాడు. ఈ సెంచరీపై ఇంగ్లాండ్ ఓపెనర్ స్పందిస్తూ..జైశ్వాల్ బ్యాటింగ్‌లో అటాకింగ్ గా ఆడటానికి ఇంగ్లండ్‌కు కొంత క్రెడిట్ దక్కుతుందని డకెట్ అన్నాడు. ఈ వ్యాఖ్య అభిమానులకు అసలు నచ్చలేదు. డకెట్ చేసిన వ్యాఖ్యలను ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లు నాజర్ హుస్సేన్, మైఖేల్ వాన్ సైతం బెన్ డకెట్ ను విమర్శించారు.ప్రస్తుతం శ్రీలంకతో ఇంగ్లాండ్ స్వదేశంలో సిరీస్ ఆడనుంది. జూలై 21న ఓల్డ్ ట్రాఫర్డ్ లో తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్ కు ముందు జైశ్వాల్ పై చేసిన వ్యాఖ్యలకు డకెట్ స్పందించాడు. డైలీ మెయిల్‌తో మాట్లాడుతూ.. తాను యశస్వి జైశ్వాల్ ను విమర్శించలేదని.. అతన్ని అభినందించానని చెప్పుకొచ్చాడు. జైశ్వాల్ ప్రపంచ స్థాయి ఆటగాడని.. నేను అన్న మాటలు జనాలు తప్పుగా అర్థం చేసుకున్నారని ఈ ఇంగ్లాండ్ ఓపెనర్ తెలిపాడు.

# జాన్వీ కపూర్.. స్టన్నింగ్ గ్లామర్ ట్రీట్




బ్లాక్ డ్రెస్‌లో రకుల్ ప్రీత్ ఆకర్షణీయమైన క్లిక్‌లు

బాలీవుడ్ లో హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న అందాల భామ జాన్వీ కపూర్. ఒకప్పటి స్టార్ హీరోయిన్ శ్రీదేవి కూతురుగా ఆమె బాలీవుడ్ లోకి అడుగుపెట్టింది. అయితే ఇప్పటి వరకు ఆమె కెరియర్ లో అరడజను సినిమాల వరకు హిందీలో చేసింది. అయితే అందులో మొదటి చిత్రం ధడక్ తప్ప ఏ ఒక్కటి కమర్షియల్ సక్సెస్ కాలేదు. నటిగా మంచి మార్కులు వేసుకున్న స్టార్ హీరోలతో జతకట్టే ఛాన్స్ లు మాత్రం హిందీ చిత్రపరిశ్రమలో రాలేదు. అయితే శ్రీదేవికి ఎలా అయితే తెలుగు చిత్రపరిశ్రమ స్టార్ ఇమేజ్ అందించిందో అలాగే జాన్వీకి కూడా ఊహించని స్థాయిలో పాన్ ఇండియా మూవీతో తెరంగేట్రం చేసే ఛాన్స్ వచ్చింది. అది కూడా గ్లోబల్ స్టార్ ఎన్టీఆర్ కి జోడీగా దేవర చిత్రంలో ఆమె మొదటి తెలుగు అవకాశం దక్కించుకుంది.

ఇప్పుడు అక్కినేని యువ హీరో అఖిల్ కి జోడీగా ధీర అనే మూవీ కోసం జాన్వీ కపూర్ ని ఎంపిక చేయాలని అనుకుంటున్నారంట. అయితే ఇంకా అఫీషియల్ గా కన్ఫర్మ్ కాలేదు. జాన్వీ కపూర్ కి సినిమాల ద్వారా వచ్చే ఫేమ్ కంటే ఇన్ స్టాగ్రామ్ లో గ్లామర్ షోతో లభించిన పాపులారిటీ ఎక్కువ అని చెప్పాలి. ఇన్ స్టాగ్రామ్ లో జాన్వీ కపూర్ చేసే అందాల ప్రదర్శనని మిలియన్స్ లో ఫాలోవర్స్ ఉన్నారు. ఇక సోషల్ మీడియా ద్వారా కాస్ట్యూమ్స్ ని ప్రమోట్ చేస్తూ జాన్వీ కపూర్ ఆదాయం కూడా భాగానే ఆర్జిస్తోంది. అందుకే రెగ్యులర్ గా హాట్ హాట్ కాస్ట్యూమ్స్ తో గ్లామర్ షో చేస్తూ ఫ్యాన్స్ కి అందాల విందు అందిస్తూ ఉంటుంది. ఈ ఫోటోలకి కూడా లక్షల్లో లైక్స్ వస్తాయి. బాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కి మించిపోయే విధంగా జాన్వీ కపూర్ హాట్ షో ఉంటుందని చెప్పొచ్చు. తాజాగా మరోసారి గోల్డ్ కలర్ ట్రెడిషనల్ డ్రెస్ తో అదిరిపోయే రేంజ్ లో అందాల ప్రదర్శన చేస్తూ జాన్వీ కపూర్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేసింది.. మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన ఈ డ్రెస్సింగ్ లో జాన్వీ కపూర్ దివి నుంచి దిగి వచ్చిన అప్సరసలా ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఏకంగా 11 లక్షల మందికి పైగా జాన్వీ కపూర్ హాట్ ఫోటోలని లైక్ చేయడం విశేషం.







నలుపు చీరలో అలయ ఎఫ్ యొక్క అద్భుతమైన చిత్రాలు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com